టీజీఐఐసీ, ఐలాలో బదిలీలు

జీడిమెట్ల: జీడిమెట్లలోని టీజీఐఐసీ, ఐలాలో ఉద్యోగులు భారీగా బదిలీ అయ్యారు. ఒక్కసారిగా అధికారుల నుంచి కిందిస్థాయి ఉద్యోగుల వరకు బదిలీలు కావడంతో ఉద్యోగులు ఆలోచనలో పడ్డారు. డిప్యూటీ జెడ్ఎం జ్యోతి, ఐలా కమిషనర్ నజీర్, విజయ సైతం బదిలీ అయ్యారు. సోమవారం వరకు వారికి కొత్తగా కేటాయించిన స్థానాల్లో వారు రిపోర్టు చేయాల్సి ఉంది. ఏది ఏమైనా కొత్తగా వచ్చిన అధికారులు కనీసం సంవత్సరం కూడా ఇక్కడ పనిచేయకుండానే బదిలీ అయ్యారు.

పేదోడి ఫ్రిజ్‌కి భలే డిమాండ్



హెచ్ఎంటీ ప్రాంతంలో అమ్మకానికి ఉంచిన మట్టి కుండలు

రంగారెడ్డినగర్: ఎండలు ముదరడంతో చల్లటి నీటిని అందించే మట్టి కుండలు (పేదోడి ఫ్రిజ్)కు గిరాకీ పెరిగింది. చింతల్ నుంచి షాపూర్‌నగర్‌కు వెళ్లే మార్గంలోని హెచ్ఎంటీ ప్రాంతంలో పలు చోట్ల మట్టి కుండలు, మట్టి నీళ్ల బాటిళ్లను విక్రయిస్తున్నారు. ఒక్కో కుండ సైజును బట్టి రూ.200 నుంచి 300 ధర పలుకుతోంది. అదే కూజాలు, మట్టి బాటిళ్లను రూ.150 నుంచి 200 వరకు అమ్ముతున్నారు. వేసవి ఎండలు తీవ్రమవుతుండటంతో చాలా మంది మట్టి కుండలను, కూజాలను కొనుగోలు చేస్తున్నారు.

నార్త్‌సిటీ స్కూల్‌లో రంగోలి




సుభాష్‌నగర్: సూరారం నార్త్ సిటీహైస్కూల్‌లో ఒకరోజు ముందే గురువారం హోలీ వేడుకలు జరుపుకున్నారు. సహజ సిద్ధమైన రంగులతో హోలీ జరిపించి, హోలీ పండుగ యొక్క విశిష్టతను తెలియజేశారు. శుక్రవారం జరగనున్న హోలీ పండుగలో తీసుకోవలసిన జాగ్రత్తలను పాఠశాల స్కూల్ కరస్పాండెంట్ వెంకటేష్ వివరించారు.

సర్కిల్ కార్యాలయంలో మహిళా దినోత్సవం



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ నరసింహ మహిళా సంఘాల సభ్యులకు మెమోంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు. ప్రభుత్వ పరంగా మహిళలకు అందే పథకాలతో లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రజా సమస్యలపై గురువారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్ల బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా డివిజన్‌లలోని సీసీ రోడ్లు, మురుగునీటి పారుదల డ్రైన్లు, వీధి దీపాలు, శ్మశాన వాటికలు, పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, రవీందర్ రెడ్డి, మందడి శ్రీనివాసరావు, సతీష్ గౌడ్, సబిహా బేగం, రోజా దేవి రంగారావు, శిరీష, మాజీ కార్పొరేటర్‌లు శ్రావణ్‌కుమార్, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తిని కొనసాగించాలి : ఎస్ఎఫ్ఐ

కూకట్‌పల్లి: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి అమరుల స్ఫూర్తిని నేటి తరం కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అవినాష్, కార్తిక్ అన్నారు. గురువారం మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్‌గారు, సుఖ్‌దేవ్ చూపిన మార్గం ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భగత్, కమిటీ సభ్యులు మహేందర్, ఆనంద్, మహేష్, ఆశిష్, రక్షిత్, మహేశ్వర్, వాసు, ప్రణయ్, కరుణాకర్ పాల్గొన్నారు.

23 కిలోమీటర్లు.. రూ.30 కోట్లు



జీడిమెట్ల ఫేజ్ 2లో పది రోజుల క్రితం వేసిన బీటీ రోడ్డు

పరిశ్రమలు అంటేనే ప్రగతి, ఉద్యోగాలు.. పారిశ్రామిక అభివృద్ధి జరగాలంటే మౌలిక వసతులైన రోడ్లు, నీరు, విద్యుత్ ఉండాల్సిందే. గతంలో వేసిన రోడ్లు చాలా చోట్ల ధ్వంసం కావడంతో అధికారులు రోడ్లపై దృష్టి సారించారు. రూ.20 కోట్లు వెచ్చించి 18 కిలోమీటర్ల మేర తారు రోడ్లు వేశారు. జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో 5 ఫేజ్‌లలో ఉండగా రోడ్లు 30 కిలోమీటర్ల మేర ఉన్నాయి. దాదాపు 70 శాతం పాత బీటీరోడ్లు, సీసీ రోడ్లపై కొత్తగా బీటీ వేశారు. బడ్జెట్ మిగలడంతో మరో 2 కిలోమీటర్ల మేర రోడ్డు వేయడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. – జీడిమెట్ల

- జీడిమెట్ల పారిశ్రామిక రోడ్లకు మహర్దశ
- త్వరలో నర్సాపూర్ రాష్ట్ర రహదారి నుంచి దూలపల్లి గేట్ వరకు పనులు

రూ.10 కోట్లతో దూలపల్లి గేట్ వరకు..

నర్సాపూర్ రాష్ట్ర రహదారి నుంచి దూలపల్లి గేటు వరకు ఎంఎస్ఎంఈ ద్వారా రిలీజ్ అయిన రూ.10 కోట్ల నిధుల ద్వారా రోడ్లు వేయనున్నారు. ఇప్పటికే కాంట్రాక్ట్ అగ్రిమెంట్ సైతం పూర్తైంది. రెండు



జీడిమెట్ల ఫేజ్ 1లో పూర్తైన బీటీ రోడ్డు

చిన్న అడ్డంకుల వలన బ్రేక్ పడింది. దూలపల్లి రోడ్డును ఎక్స్‌టెన్షన్ చేయాలంటే రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చడంతో పాటు చెట్లను తొలగించాల్సి ఉంది. చెట్ల తొలగింపునకు ఇప్పటికే ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారిని అనుమతులు కోరారు. వారి అనుమతుల అనంతరం రోడ్ల పనులు మొదలవుతాయని టీజీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ తెలిపారు.

హర్షం వ్యక్తం చేస్తున్న పారిశ్రామికవేత్తలు

జీడిమెట్లలో దాదాపు వెయ్యికి పైగా పరిశ్రమలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి లోడింగ్, అన్‌లోడింగ్ నిమిత్తం ప్రతిరోజు వందల్లో లారీలు వచ్చి పోతుంటాయి. రోడ్లు సరిగా లేక గతంలో డ్రైవర్లు వాహనాలను పరిశ్రమలకు దూరంగా పార్కింగ్ చేసేవారు. ఇప్పుడు ఉన్న రోడ్ల వెడల్పు పెంచడంతో వాహనాల పార్కింగ్‌కు సైతం వీలుగా ఉంటుంది. టీజీఐఐసీ, ఐలా అధికారులు పట్టించుకుని కొత్త రోడ్లు వేయడంతో జీడిమెట్ల పారిశ్రామిక వేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

70 శాతం పనులు పూర్తి

జీడిమెట్ల పారిశ్రామికప్రాంతంలో ఇప్పటికే 70 శాతం మేర రోడ్లలో బీటీ రోడ్లు వేశాం. బడ్జెట్ మిగలడంతో మరో రెండు కిలోమీటర్ల మేర అనుమతి లభించింది. మరికొద్ది రోజుల్లోనే దూలపల్లి రోడ్డు పనులు సైతం ప్రారంభమవుతాయి. టీజీఐఐసీ నుంచి రూ.20 కోట్లు, ఎంఎస్ఎంఈ నుంచి రూ.10 కోట్లు మొత్తం రూ. 30 కోట్లతో రోడ్ల పనులు నడుస్తున్నాయి.

– జ్యోతి, టీజీఐఐసీ డిప్యూటీ మేనేజర్

రూ.30 కోట్లతో రోడ్డు పనులు



జీడిమెట్లలో దాదాపు 30 కోట్ల రూపాయలతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. పరిశ్రమలకు మౌలిక వసతులు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం, అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. పారిశ్రామిక ప్రగతి బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది.

– నజీర్, జీడిమెట్ల ఐలా కమిషనర్

ఎల్ఆర్ఎస్‌ను గడువులోగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ గౌతమ్

నిజాంపేట్ : ఎల్ఆర్ఎల్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు కీలకమైన సూచనలు చేశారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై ఆరాతీసి, ఫీల్డ్ ఇన్స్‌పెక్షన్ ఏవిధంగా చేస్తున్నారని వార్డు ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31లోగా క్రమబద్ధీకరణ రుసుము చెల్లించినట్లయితే ప్రభుత్వం 25 శాతం రాయితీ అందిస్తుందని దరఖాస్తుదారులకు వార్డు ఆఫీసర్లు తెలపాలని, ఆ దిశగా జిల్లాలోని మున్సిపల్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. మొబైల్ యాప్ ద్వారా అప్లికేషన్ నంబర్, పేరు, మొబైల్ నెంబర్ మొదలగు వివరాల ద్వారా ఫీల్డ్ ఇన్స్‌పెక్షన్ చేసి రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు క్రమబద్ధీకరణ కాపీలను వీలైనంత తొందరగా అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీని వల్ల ప్రజల్లో నమ్మకం కలిగి మిగతావారు కూడా రుసుము చెల్లించడానికి ముందుకొచ్చే అవకాశం ఉందని తెలిపారు. సాంకేతిక సమస్యల ద్వారా వచ్చే ఇబ్బందులను అధిగమిస్తూ ఈ ప్రక్రియను కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు క్రమబద్ధీకరణ దరఖాస్తుల పై పురోగతిని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు కారణాలు పరిగణలోకి తీసుకొని సకాలంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను వసూలు చేసే ప్రక్రియ వేగంతం చేసి లక్ష్యాన్ని అధిగమించాలని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కార్పొరేషన్ పరిధిలో యూనిఫామ్ టాక్స్ పద్ధతిని అమలు పర్చడానికి కృషి చేయాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా కంచె నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సబేర్ అలీ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్



కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలో గురువారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. వాటర్ వర్క్స్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, సిబ్బంది రంగులు చల్లుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.. – చింతల్

మంటలంటుకొని డీసీఎం దగ్ధం

జీడిమెట్ల: తుక్కుతో గోదాముకు వచ్చిన డీసీఎం కాలిపోయిన సంఘటన జీడిమెట్ల ఫాక్స్ సాగర్ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఫాక్స్‌సాగర్ సమీపంలో ఓ వ్యక్తి స్క్రాప్ గోదాం నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి గోదాం వద్దకు తుక్కుతో కూడిన ఓ డీసీఎం వచ్చింది. వాహనంలో ఒక్కసారిగా మంటలు వెలువడ్డాయి. వాహనం మొత్తం దగ్ధమై బూడిదైంది. డీసీఎంలో రసాయనాలకు సంబంధించిన ముడిసరుకులు ఏమైనా వచ్చాయోమోనని స్థానికులు అనుమానిస్తున్నారు.



నిరంతర విద్యుత్ అందించేందుకు కృషి



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న టీజీపీడీసీఎల్ చైర్మన్ ముషరఫ్ ఫారూఖీ అలీ

దుండిగల్: విద్యుత్ కోతలు లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామని టీజీపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషరఫ్ ఫారూఖీ అలీ అన్నారు. గురువారం భౌరంపేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 220/33 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి, భౌరంపేట్ ప్రాంతాల్లో లో వోల్టేజీ సమస్య తొలగనుందని, అదే విధంగా కోతలు లేని విద్యుత్ సరఫరా చేసేందుకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ సీఈ కామేష్, ఎస్ఈలు రవికుమార్, నరసింహులు, డీఈ జీడిమెట్ల లీలా ప్రసాద్, డీఈ టెక్నికల్ శ్రీనాథ్‌రెడ్డి, కూకట్‌పల్లి డీఈ జనప్రియ, ఏడీఈ జీడిమెట్ల ప్రేమ్‌కుమార్, ఏడీఈ మియాపూర్ హరికృష్ణ, ఏఈ భౌరంపేట్ సాయికిరణ్, ఏఈ ప్రగతినగర్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



షాపూర్‌నగర్ మార్కెట్‌లో..

మార్కెట్‌లో హోలీ సందడి

హోలీ పండుగ సందర్భంగా ఒకరోజు ముందే రోడ్లకు ఇరువైపులా రంగోలికి సంబంధించిన షాపులు వెలిశాయి. వివిధ రంగులతో కూడిన కలర్స్, వాటర్‌గన్స్, బత్తీసలు అమ్మకానికి పెద్ద ఎత్తున తీసుకొచ్చారు. వీటిని చిన్న నుండి పెద్ద వరకు కొనుగోలు చేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో కొనుగోలుదారులతో సందడి నెలకొంది. – సుభాష్‌నగర్



ఓ దుకాణం వద్ద విక్రయానికి ఉంచిన రంగులు..

సమస్యలు పరిష్కరించాలని వినతి

నిజాంపేట్: ప్రగతినగర్ శ్మశాన వాటికలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఎస్ఎంసీ ఆఫీసులో సంబంధిత వ్యక్తుల ఫోన్ నంబర్స్ బోర్డులను ఏర్పాటు చేస్తామని, ప్రగతినగర్ శ్మశానవాటిక సమీపంలో నోటీసు బోర్డులు, అంత్యక్రియల ఛార్జీల గురించి సమాచార బోర్డు ఏర్పాటు చేయాలని మేనేజర్ జయరాజుని కమిషనర్ ఆదేశించారు. నీటి పనులు, వాచ్‌మెన్, అంత్యక్రియలకు సంబంధించిన సంప్రదింపు ఫోన్ నంబర్ల సమాచారం, మరణ ధృవీకరణ ప్రతాల కోసం రసీదు పుస్తకం, ప్రగతినగర్ శ్మశానవాటికకు సంబంధించి ఏవైనా ఇతర సమస్యలు ఉంటే వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎన్ఎంసీ 6వ డివిజన్ అధ్యక్షులు ఉప్పు జస్వంత్, నాయకులు సాయి కుమార్, ఎలీషా, మణికంఠసాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా



కూన శ్రీశైలంగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ ప్రజలు అధైర్య పడొద్దని, తాను అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో గురువారం పలు సంక్షేమ సంఘాల నేతలు, ప్రజలు కలిసి వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన ఆయా శాఖల అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. నూతనంగా ఎన్నికైన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రాకేష్ ముదిరాజ్‌ని సత్కరించారు. అనంతరం కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. ఎంతమంది అడ్డంకులు సృష్టించినా ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడతామన్నారు. ఇంటింటికి ఇందిరమ్మ పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నియోజవర్గంలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

సైలెన్సర్లు లేని వాహనాలపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్: సైలెన్సర్ లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేయాలని పర్యావరణ ప్రేమికుడు, సామాజిక కార్యకర్త కోలా రవీందర్ గురువారం జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూరారం కాలనీ మెయిన్ రోడ్లపై సైలెన్సర్ లేకుండా యువకులు ఓవర్ స్పీడ్‌తో స్థానిక ప్రజలను ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పలు సందర్భాల్లో చిన్నారులు భయపడి ఆసుపత్రి పాలైన ఘటనలు కూడా ఉన్నాయని వివరించారు. దీనిపై సీఐ శ్రీనివాస్ స్పందిస్తూ త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సైలెన్సర్లు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఎవరైనా మీ ప్రాంతాల్లో సైలెన్సర్లు లేకుండా వాహనాలు నడిపితే తమకు సమచారం అందించాలని, వారి తల్లిదండ్రుల సమక్షంలో సదరు వ్యక్తులకు కౌన్సిలింగ్ ఇస్తామని తెలిపారు.



ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవీందర్

అంతరాయం లేకుండా నీటి సరఫరాకు కృషి

కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం అశోక్



మరమ్మతులను పరిశీలిస్తున్న జీఎం అశోక్, మేనేజర్ రమ్యభారతి

చింతల్: ఎప్పటికప్పుడు పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నామని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం అశోక్ అన్నారు. షాపూర్ నగర్ సబ్ డివిజన్ పరిధి షాపూర్ నగర్ సెక్షన్‌లోని సీఎంఆర్ స్కూల్ సమీపంలో తలెత్తిన 350 ఎంఎం డయ మెయిన్ లైన్ మరమ్మతులను గురువారం మేనేజర్ రమ్య భారతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఇబ్బందులు కలుగకుండా మరమ్మతులు చేపడుతున్నామని అన్నారు. మరమ్మతులు పూర్తికాగానే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం!

కుత్బుల్లాపూర్: కాలనీల్లో రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో దుర్గంధం వస్తుంది. జీడిమెట్ల డివిజన్ దుర్గా ఎస్టేట్స్ కమ్యూనిటీ హాల్ ఎదురుగా ఏర్పాటు చేసిన డంబర్ బిన్‌లో చెత్త నిండిపోవడంతో స్థానికులు అక్కడే పారబోస్తున్నారు. ఈ విషయమై కాలనీ ప్రధాన కార్యదర్శి కొమిరిశెల్లి నంబూద్రి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి రోజు విడిచి రోజు డంబర్ బిన్‌లలో చెత్తను తరలించే ఏర్పాట్లు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



ట్రేడ్ లైసెన్స్ లేకుండానే వ్యాపారాలు!

- మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి
- అడిగితే అధికారులకే బెదిరింపులు..

కుత్బుల్లాపూర్ : ట్రేడ్ లైసెన్స్ విషయంలో కొంత మంది నిర్వాహకులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. అసలు ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయ వనరులు కట్టకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే.. 'మీ దిక్కున చోట చెప్పుకో' అంటూ అధికారులనే బెదిరిస్తున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని కేకేఆర్ సొసైటీ రామ్ రెడ్డి నగర్‌లో ఇటీవల అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. గ్రేటర్ అధికారుల ఆదేశాలతో వివిధ ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ మిర్యాల కవిత ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో రామ్‌రెడ్డి నగర్‌లో ఉన్న వ్యాపార, వాణిజ్య సంస్థల నిర్వాహకుల ట్రేడ్ లైసెన్స్ లేకుండానే వ్యాపారాలు కొనసాగిస్తున్నట్లు తేలింది. దీంతో అప్రమత్తమైన సదరు అధికారి నోటీసులు జారీ చేసి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని కోరగా.. అందుకు వారు ససేమిరా అనడం విశేషం.



రామ్‌రెడ్డినగర్‌లో నోటీసులు ఇచ్చేందుకు వెళ్లిన అధికారిని అడ్డుకున్న ఓ వ్యక్తి

దుకాణాలు ఎక్కువ.. ట్రేడ్ లైసెన్స్ తక్కువ

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో సుమారు 9 వేల వరకు ట్రేడ్ లైసెన్స్ కలిగిన వ్యాపారస్తులు ఉన్నారు. వీరిలో సగం మంది రెన్యువల్ విషయంలో కాలయాపన చేస్తున్నారు. ఇటీవల అధికారులు 4 వేల మందికి నోటీసులను శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్, జవాన్‌లతో పంపిణీ చేశారు. కానీ వాస్తవానికి ఈ ప్రాంతంలో సుమారు 30 వేలకు పైగానే ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలి. పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తున్న వారు సైతం ట్రేడ్ లైసెన్స్ విషయానికి వచ్చేసరికి డోంట్ కేర్ అంటూ ముఖం చాటేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్న ఇటువంటి వ్యాపారస్తులపై దృష్టి సారించే దిశగా సర్కిల్ వైద్య ఆరోగ్య అధికారి కవిత ప్రణాళికలు సిద్ధం చేసింది. కొన్ని ప్రాంతాల్లో ఎన్నో ఏళ్ల నుంచి నడుస్తున్న పరిశ్రమలకు సైతం ట్రేడ్ లైసెన్స్ లేదని గుర్తించారు. వారిపై కఠినంగా వ్యవహరించే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

అనుమతులు లేకుండా గోదాములు..

రామ్‌రెడ్డి నగర్ కేకేఆర్ సొసైటీలో ఎటువంటి అనుమతులు లేకుండా భారీ గోదాములు మొదలుకొని చిన్న, చిన్న గోదాములు ఉన్నాయి. ఇక్కడ జరిగే ఉత్పత్తులు వివిధ ప్రాంతాలకు క్రయవిక్రయాలు చేస్తూ లక్షల్లో గడిస్తున్నారు. కానీ ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయ వనరులు రాకుండా జాగ్రత్త పడుతూ వస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్ విషయంపై ఆరా తీయగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. అక్రమంగా వెలసిన గోదాములకు విద్యుత్ అధికారులు డబ్బులకు ఆశపడి మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

లైసెన్స్ తీసుకోవాల్సిందే..



వ్యాపారాలు కొనసాగించే వారు మొదట ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. ఇప్పటికే తీసుకున్న వారు రెన్యువల్ చేసుకోవాలి. కొంత మంది ఎటువంటి ట్రేడ్ లైసెన్స్ లేకుండా కంపెనీ నడుపుతున్నారు. వారికి నోటీసులు జారీచేసి ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 140 కి పైగా పరిశ్రమలు ఏర్పాటు చేసి వివిధ ఉత్పత్తులు చేసే వారిని గుర్తించాము. వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలి. లేనిపక్షంలో వారిపై చర్యలు తప్పవు.

– డాక్టర్ మిర్యాల కవిత, కుత్బుల్లాపూర్ వైద్య ఆరోగ్య అధికారి